క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని వేటపాలెం గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేటపాలెం ఫీడర్ పరిధిలోని వేటపాలెం, తోటపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గణేష్ టీమ్ ప్రతిభ



రేపల్లె: రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ టీమ్ ప్రతిభ చాటింది. కృష్ణాజిల్లా అవనిగడ్డలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. పోటీలలో పాల్గొన్న చెరుకుపల్లి మండలం రాజోలుకు చెందిన రామకృష్ణారెడ్డి టీమ్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.30 వేల నగదు బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డాక్టర్ ఈవూరు గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన




బాపట్ల: గోపరాజు రామచంద్రరావు, రుక్మిణమ్మ చారిటబుల్ ట్రస్ట్, విలేజ్ వెల్నెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వెదుళ్ళపల్లిలో డాక్టర్ మహదేవమూర్తి నేమాని ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని డాక్టర్ మాధవి గోపరాజు ప్రారంభించారు. 122 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మాధవి గోపరాజు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైతే చీరాల అమ్మ కంటి వైద్యశాల నుంచి వైద్య సహాయం అందిస్తామని తెలిపారు. బాపట్ల నుంచి డాక్టర్ సీహెచ్ రామ్మోహనరావు, డాక్టర్ సీహెచ్ మీనా వారంలో రెండు రోజులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినోదకుమార్, జి.ఆంజనేయాచార్యులు, గంగా మేరీ, ముత్తాయిపాలెం ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు, ట్రస్టీలు పీఎస్ శ్రీనివాసమూర్తి, గోపరాజు పార్థసారధి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారం గొలుసు చోరీ

వేమూరు: మహిళ మెడలో బంగారం గొలుసు చోరీ అయిన ఘటన చోటు చేసుకుంది. వేమూరు మండల కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వేణుగోపాలస్వామి దేవస్థానం వద్దకు ఆదివారం ఉదయం 7 గంటలకు వచ్చారు. ఓ ఇంటి వద్ద శుభ్రం చేసుకొని ఇంటిలోకి వెళుతుంది. ఆ సమయంలో ఆమెను అమర్తలూరు వెళ్లాలని.. దారి గురించి అడిగారు. సమాధానం చెప్పి, ఇంటిలోకి వెళుతుండగా ఆమె వెనకే వెళ్లి మెడలో నాలుగు సవర్ల బంగారం గొలుసు లాక్కొని పరారయ్యారని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని 5,6 శానిటేషన్ డివిజన్ పరిధిలో ఆదివారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే అటెండెన్స్‌ను పరిశీలించారు. అందరూ తప్పనిసరిగా సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలశెట్టి ప్రసాద్, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వైభవంగా అంజన్నకు పూజలు

ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి 21వ వార్షికోత్సవం ఈనెల 7న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పదహారు రోజుల పండుగను విశేషంగా జరిపారు. ఉదయాన్నే స్వామికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. పొంగళ్లను స్వామివారికి నివేదన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పొట్టి వీరేశం గుప్తా, గ్రామపెద్ద కె.పేరారెడ్డిలు పర్యవేక్షించారు.

ముమ్మరంగా తులసి నాట్లు



వెదుళ్ళపల్లిలో తులసి నాట్లు వేస్తున్న మహిళలు



కుక్కలవానిపాలెంలో లైన్ ఆకు నాట్లు వేస్తున్న మహిళలు

ఇటీవల కురిసిన వర్షాలకు నేలలు పదునెక్కడంతో మెరక ప్రాంతాల్లో పూల తోటలు, ఆకుకూరల సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. త్వరలో పూల సీజన్ ముగిసిపోతుండటంతో తులసి, లైన్‌ఆకులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకున్న రైతులు తులసి, లైన్ ఆకు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న తొలకరి వర్షాలకు నేలలు సాగుకు అనుకూలంగా మారడంతో మండలంలోని వెదుళ్ళపల్లి, స్టువార్టుపురం, దరివాదకొత్తపాలెం, కుక్కలవారిపాలెం, మహాత్మాజీపురం తదితర గ్రామాల్లోని రైతులు తులసి నాట్లు విస్తారంగా వేస్తున్నారు. ఇదిలా ఉండగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో తులసి నాట్లతోపాటు మరువం, లైన్ ఆకు, ఆకుకూరల సాగుకు శ్రీకారం చుట్టారు. దీంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. రోజుకు ఒక్కో మహిళకు రూ.400 నుంచి 500 వరకు డిమాండ్ చేస్తున్నారు. 30 సెంట్లలో తులసి నాట్లు వేయడానికి సుమారు రూ.12 వేల మేర వరకు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. - బాపట్లటౌన్

డ్రైనేజీల్లో పూడిక.. రైతుల్లో ఆవేదన

పూడికతీత పనులకు ముహూర్తం ఎప్పుడో..?

- వర్షకాలం వస్తున్నప్పటికీ పట్టించుకోని డ్రైనేజీ విభాగం
- ఏటా ముంపునకు గురవుతున్నప్పటికీ చర్యలు శూన్యం



వెదుళ్ళపల్లి డ్రైనేజీలో పేరుకుపోయిన పూడిక

బాపట్ల: బాపట్ల జిల్లాలో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా మారింది రైతుల పరిస్థితి. నియోజకవర్గం చుట్టుపక్కల జీవనదులు మాదిరి జిల్లాలోని పలు చోట్ల నుంచి సముద్రంలో కలిసేందుకు కాలువలు వెళుతున్నప్పటికీ వాటిని సాగునీటిగా ఉపయోగించుకోవటంలో సఫలీకృతులు కాలేకపోతున్నారు. కనీసం కాలువలో పూడికతీత పనులైనా చేపడితే కొద్దిపాటి నీరైనా సముద్రం పాలు కాకుండా చూసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ పనులు చేపట్టేందుకు ఎవరు ముందుకు రావటం లేదు. కేవలం డ్రైనేజీలపై కట్టల ఎత్తులు పెంచటంతోనే సరిపెట్టి అటు నీరు నిల్వ ఉంచకపోగా భారీ వర్షాలకు ముంపునీరు, పంట కాలువల్లోని మురుగు నీరు బయటకు వెళ్లలేక పొలాల్లోనే నిల్వ ఉండిపోతున్నాయి.

నల్లమడ డ్రైనేజీ పరిస్థితి మరీ దారుణం

గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని నల్లమడ డ్రైనేజీ ఒక రకంగా జీవనదిగా చెప్పవచ్చు. ఈ డ్రైనేజీ కిందగా కొమ్మమూరు కాలువ ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో నల్లమడ డ్రైనేజీపై క్యాచ్‌లాక్కులు ఉన్నాయి. నల్లమడ అడవుల్లో నుంచి వచ్చే ఈ డ్రైనేజీ అప్పాపురం వద్ద కనీసం 20 అడుగుల ఎత్తులో భారీగా ప్రవహిస్తుంది. ఈ డ్రైనేజీ కట్టలు సరిగా లేకపోవటంతో నర్సాయపాలెం, జిల్లెళ్ళమూడి, మూలపాలెం, బాపట్లలోని కొంత భాగంలో పొలాలు పూర్తిగా మునిగిపోతున్నాయి. ప్రతి ఏడాది ముంపునకు గురవుతున్నప్పటికీ ప్రభుత్వం చర్యలు మాత్రం శూన్యం. ఈ డ్రైనేజీ ముంపును ఎదుర్కొనే విధంగా పూడికతీత పనులు చేపడితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అదేవిధంగా పేరలి డ్రైనేజీ, తుంగభద్ర, ఈస్ట్ చాంపు డ్రైనేజీలో కూడా పూడికతీత పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. సాధారణంగా వేసవి కాలంలో పూడికతీత పనులు చేపడితే వర్షకాలానికి నీటి నిల్వతోపాటు రైతులుకు ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది కూడా కనీసం వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా ప్రతిపాదనలకు నోచుకోకపోవటంతో ఈ ఏడాది కూడా పూడికతీత పనులకు ముహూర్తం లేనట్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వెదుళ్ళపల్లి డ్రైనేజీ పరిస్థితి

పర్చూరు డివిజన్‌లోని కొంత ప్రాంతాన్ని కలుపుకుని వెదుళ్ళపల్లి నుంచి సముద్రంలో కలిసే వెదుళ్ళపల్లి డ్రైనేజీలో భారీగా పూడిక పేరుకుపోయింది. ఈ డ్రైనేజీ కింద పలు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు ఉన్నాయి. వీటితో వరి సాగు చేస్తుంటారు. ఈ డ్రైనేజీ పరిధిలోకి కంకటపాలెం, మురుకొండపాడు, బేతపూడి, స్టువర్టుపురం, దరివాదకొత్తపాలెం, మరుప్రోలువారిపాలెం పొలాల్లోని నీరు వెళ్లేందుకు అవకాశం ఉంది. అయినప్పటికీ ఈ డ్రైనేజీ గురించి పట్టించుకునే వారు లేకుండాపోయారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం



పురస్కారాల ప్రదానం చేస్తున్న అతిథులు

తెనాలి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం సూచించారు. వీరబ్రహ్మేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాలను, 2025 సంవత్సరానికి ఆదివారం ప్రదానం చేశారు. ముత్యంశెట్టిపాలెంలోని పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కళ్యాణమండపంలో జరిగిన సభకు ట్రస్ట్ అధ్యక్షుడు ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్ష వహించారు. గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో పట్టణంలోని ఆరు మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ట్రస్ట్ కోశాధికారి సామ్రాజ్యలక్ష్మి రూ.49 వేలను ప్రతిభా పురస్కారాల కింద అందజేశారు. డాక్టర్ జస్వంత్, అత్తలూరి బాలమురళీకృష్ణ, శాఖమూరి మల్లికార్జునరావు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తన్నీరు శివశంకర్, బూర్లె అరుణకుమారి, రమేష్, శారదను సత్కరించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, సత్యనారాయణ, గుత్తికొండ వీరగురుబ్రహ్మచారి, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఈమని వీరేంద్ర, కాంతారావు, కేశవరావు, దుర్గాప్రసాద్, రమణయ్య, శోభాదేవి, రమాదేవి, శ్రీనివాస్, జ్యోత్స్న పాల్గొన్నారు.

ఏడాది గడచినా హామీల అమలు లేదు

సీపీఎం నేతతో వివిధ గ్రామాల ప్రజలు



తెనాలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా హామీలను అమలు చేయటం లేదని సీపీఎం తెనాలి రూరల్ మండల కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మండల గ్రామాలైన కంచర్లపాలెం, గుడివాడ, కఠెవరం గ్రామాల్లో ఆదివారం ఆయన ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదని తెలిపారు. రైతులు పండిస్తున్న ధాన్యం, జొన్నలు, మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆయనకు తెలియజేశారు. పంటకాల్వలు, మురుగు కాల్వల మరమ్మతులు పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. గుడివాడ–అంగలకుదురు మధ్యలో గల కోపల్లె మైనర్ డ్రెయిన్ మరమ్మతులు చేయాల్సి వుందన్నారు. శివసాంబిరెడి మాట్లాడుతూ 2019 చట్టం వల్ల కౌలు రైతులకు నష్టం జరుగుతుందనీ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దుచేసి, రైతులకు మేలు చేసే విధంగా చట్టం చేస్తామనీ, కౌలు రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి నేతలు ఇచ్చిన వాగ్దానం అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఆయన కోరారు. తల్లికి వందనం ఆర్థికసాయం లబ్ధిదారులు అందరికీ పడటం లేదని, ప్రభుత్వం అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సాంబిరెడ్డి డిమాండ్ చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

- 51 ఏళ్ల తర్వాత కలుసుకున్న పాత మిత్రులు
- కొలకలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1973–74 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల కలయిక

తెనాలిటౌన్: పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరి పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని కొలకలూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మాచర్ల నాగేశ్వరరావు కొనియాడారు. రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ 1973–74 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. నాడు తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ, అప్పటి తరగతి గదుల్లో కూర్చుని మురిసిపోయారు. తమవంతుగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని సంకల్పించారు. అనంతరం హెచ్‌ఎం మాచర్ల నాగేశ్వరరావును దుశ్శాలువాతో సత్కరించారు. 51 సంవత్సరాల నాటి విద్యార్థులంతా ఒక చోటకు చేరి ఆత్మీయ కలయిక నిర్వహించడం అభినందనీయమని హెచ్‌ఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ షేక్ జిలానీ, పూర్వ విద్యార్థులు చుండూరు శ్యామ్‌సుందర్, వైడీఎస్ రవి, గూడపాటి కోటేశ్వరరావు, బర్తిపూడి వెంకటేశ్వరరావు, దశరథ రామయ్య, ఆరాధ్యుల రమాదేవి, గంపల సామ్రాజ్యం, వెలుగురి రమాదేవి, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌ల పాలకవర్గాలకు శిక్షణ సదస్సు



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆదివారం రోటరీ క్లబ్‌ల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ట్రైనింగ్ సెమినార్‌ను ఆదివారం నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పర్యవేక్షణలో 2025–26 సంవత్సరానికి తాడేపల్లి, మంగళగిరి, తెనాలి, పొన్నూరు, రేపల్లె రోటరీ క్లబ్‌ల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు ఈ సెమినార్‌ను ఏర్పాటు చేశారు. పాస్ట్ గవర్నర్ అన్నె రత్నప్రభాకర్, అనిల్ చక్రవర్తి, డాక్టర్ విష్ణుబాబు, కె.సీతారమేష్‌లు ట్రైనింగ్ ఇచ్చారు. ఆయా క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు. తెనాలి క్లబ్ తరఫున అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, 2025–26 అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, జీవీ నారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, డిస్ట్రిక్ట్ మెంబర్లు గుత్తా వెంకటరత్నం, ధూళిపాళ్ల రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

- వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- జంపని గ్రామ పార్టీ అధ్యక్షుడిగా షేక్ మస్తాన్ వలి ఏకగ్రీవం



గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలిని అభినందిస్తున్న వరికూటి

జంపని(వేమూరు): పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడి నియామకంపై ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడిగా షేక్ మస్తాన్ వలి(బుజ్జి)ని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ వేమూరు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ పార్టీ అధ్యక్షుల నియామకం పూర్తయిందని, అదే విధంగా జంపని గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడి నియామకం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. కార్యకర్తలు ఏమైనా సమస్యలు ఉంటే గ్రామ పార్టీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లాలని, పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామ స్థాయి నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో దాది సుబ్బారావు, కోగంటి లవకుమార్, చందోలు డేవిడ్ విజయకుమార్, మాజీ జెడ్పీటీసీ విష్ణుమొలకల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ చుండూరు పెద్ద మరియమ్మ, ఉప ఎంపీపీ షేక్ బాజీ, జంపని పురుషోత్తం, తాడిబోయిన అంకమ్మరావు, ఆలపర్తి రవి, బొల్లిముంత ఏడుకొండలు, మైలా చంద్రసేన, జంగం భాస్కరరావు, బాలిగ శిమన్నారాయణ దాద్ బుడే, మూల్పూరు అశోక్, తాడిశెట్టి నరసింహరావు, వేల్పూల పెద నరయ్య, జంగం సుధాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కూటమి నేతల వ్యాఖ్యలు

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ శేషగిరిరావు



రేపల్లె: రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా కూటమి నేతల వ్యాఖ్యలు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. తమ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై రాజమండ్రి రూరల్ శాసనసభ్యుడు బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగిన జగన్‌మోహన్ రెడ్డిని నరుకుతాం... చంపుతాం... అంటూ మాట్లాడటం ఎవరిని బెదిరించటానికని ప్రశ్నించారు. పల్నాడు పర్యటనలో తమ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అభిమానంతో జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కొటేషన్‌లను సైతం రాజకీయం చేయటం తగదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా మాట్లాడుతున్న కూటమి నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను ప్రశ్నించినందుకు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసినందుకు, అమ్మ ఒడి పథకాన్ని అందరికి వర్తింపజేయాలన్నందుకు, నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలన్నందుకు, తమ పార్టీ నేతలను నరుకుతారా... చంపుతారా అంటూ ప్రశ్నించారు. బెదిరింపులకు దిగితే భయపడేవారు లేరని, ప్రజా సమస్యలపై తమ పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందని చెప్పారు. కూటమి నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.

తాగునీటి ప్రధాన పైపులైను పనులు పూర్తి

మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



పైపులైను పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల: బాపట్ల పట్టణం జీబీసీ రోడ్డులోని భీమునిగుంట వాగు వద్ద ఉన్న ప్రధాన తాగునీటి పైపులైను పనులను ఆదివారానికి పూర్తి చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో తాగునీటి పైపులైను కనెక్షన్ ఇచ్చేందుకు చేపట్టిన పనులు పూర్తయ్యాయని అన్నారు. ఈ మేరకు తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యా నగర్, శ్రీనివాస నగర్, పటేల్ నగర్, కారుమూరి హనుమంతరావు కాలనీ, పాడిసన్ పేట కాలనీలకు రేపటి నుండి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. 14వ వార్డు వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద భీమునిగుంట వాగులో తొలగించిన పూడిక తీత పనుల పురోగతిని పరిశీలించామని తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి ఉన్నారు.

ఘనంగా సాంబిరెడ్డి సంస్మరణ సభ



సాంబిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పెదకాకాని దేవస్థానం బోర్డు పూర్వ సభ్యుడు కొండమడుగుల సాంబిరెడ్డి సంస్మరణ సభను ఆదివారం రాత్రి ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్, తెనాలి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, సాంబిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రముఖ రంగస్థల నటుడు కావూరు సత్యనారాయణ, శ్రీనివాసరావు (లింగారావుపాలెం), ఏవూరి హరిబాబు(గుంటూరు), గోపాలరెడ్డి (పెదకాకాని), జె.సాంబశివరావు (వింజనంపాడు) తదితరులు పాల్గొన్నారు. సభానంతరం అద్దేపల్లి–ఆరాధ్యుల ఆర్ట్స్, తెనాలి వారి 'ఎవరు' సాంఘిక నాటికను ప్రదర్శించారు. ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య రచనకు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి దర్శకత్వం వహించారు.

ఉయ్యూరి అప్పిరెడ్డికి సన్మానం



ఉయ్యూరి అప్పిరెడ్డిని సన్మానించిన చుండూరు గ్రామస్తులు

చుండూరు(వేమూరు): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల విభాగం కార్యదర్శిగా ఉయ్యూరి అప్పిరెడ్డిని కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది. చుండూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఈ సందర్భంగా ఆయనను ఆదివారం సన్మానించారు. ఎంపీపీ జాలాది రూబేను మాట్లాడుతూ చుండూరు గ్రామ సర్పంచ్ ఉయ్యూరి అప్పిరెడ్డిని పార్టీ మేధావుల విభాగం కార్యదర్శిగా నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఉయ్యూరి అప్పిరెడ్డి వైఎస్సార్‌సీపీకి ఎనలేని సేవ అందించారని, ఆయన సేవను పార్టీ గుర్తించి మేధావుల విభాగం కార్యదర్శి పదవి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పదవి కోసం కృషి చేసిన వరికూటి అశోక్‌బాబుకు ఉయ్యూరి అప్పిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయబాబు, సునీత, సుబ్బారెడ్డి, నాయకులు సురేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.